# మహాలక్ష్మి కటాక్షం

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ
- రూ.0 టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన కలెక్టర్లు
- శనివారం మధ్యాహ్నం నుంచి పథకం అమలు
- దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు అవకాశం ఇవ్వాలని డిమాండ్లు
- ఆరోగ్యశ్రీ పథకానికి కూడా శ్రీకారం చుట్టిన అధికారులు
- కిటకిటలాడిన బస్సులు



నాగర్‌కర్నూల్‌లో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు



నాగర్‌కర్నూల్‌లో ఉచిత ప్రయాణ టికెట్ చూపిస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద రూ.10లక్షలకు పెంపు పథకాలను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ రెండు పథకాలను అధికారులు, ప్రజాప్రతినిధులు షురూ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన వద్ద కలెక్టర్ రవినాయక్, నాగర్‌కర్నూల్‌లో కలెక్టర్ ఉదయ్‌కుమార్, వనపర్తిలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జోగులాంబ గద్వాల జిల్లాలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులను ముస్తాబు చేశారు. మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్లు కోరారు. మహబూబ్‌నగర్ డిపో పరిధిలో 70 పల్లెవెలుగు బస్సులు, 36 ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి కుటుంబానికి రూ.10లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే పథకానికి కూడా శ్రీకారం చుట్టారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లెవెలుగు, మెట్రో సర్వీసులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. మధ్యాహ్నం 2గంటలకు అధికారులు ఆయా బస్టాండ్లలో ఫ్రీ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులను కూడా ఉచిత బస్సు ప్రయాణం పథకంలో చేర్చాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం..**

చేయూత కార్యక్రమం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ లో భాగంగా గుర్తించిన అన్ని దవాఖానల్లో రూ.10లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందించే పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ రెండు పథకాలు మహిళలకు, ముఖ్యంగా పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్లు కోరారు.

## ఉచిత ప్రయాణం అద్భుత పథకం

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్



మహబూబ్‌నగర్‌లో బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, డిసెంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మహాలక్ష్మి, చేయూత పథకాలను కలెక్టర్ రవినాయక్ జిల్లా కేంద్రంలో శనివారం ప్రారంభించారు. జిల్లాలోని మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా తెలంగాణ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఏదైనా గుర్తింపు కార్డును చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. చేయూత కార్యక్రమం కింద రాజీవ్ ఆరోగ్య శ్రీలో భాగంగా గతంలో ఏడాదికి కుటుంబానికి రూ.5లక్షలతో వైద్యం అందించడం జరిగిందని, ప్రస్తుతం రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. పథకాలు మహిళలు, పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అడిషనల్ ఎస్పీ రాములు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో భాస్కర్, ప్రభుత్వ ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ జీవన్, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి, డిపో మేనేజర్ సుజాత, ఆర్టీవో దుర్గప్రమీల, ఎంవీఐ నరేశ్, ఆరోగ్య శ్రీ సేవల కోఆర్డినేటర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఎంతో మేలు

- జోగులాంబ గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల, డిసెంబర్ 9 : ప్రజల సంక్షేమం కోసం మహాలక్ష్మి, చేయూత పథకాలు ప్రారంభించినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ముందుగా జిల్లా ప్రభుత్వ దవాఖాన ఆవరణలో రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10లక్షలకు పెంపు పథకాన్ని ప్రారంభించిన అనంతరం బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ఎస్పీ రితిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందేవారని, ఇకపై రూ.10లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. జిల్లాలో లక్షా 60,066 ఆహార భద్రత కార్డుదారులకు 1,672 ప్యాకేజీలు రాజీవ్‌గాంధీ పథకం కింద వర్తిస్తుందని చెప్పారు. ప్రజలకు మెరుగైనా ఆరోగ్యం అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. మహిళలకు వయసుతో సంబంధం లేకుండా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రభుత్వం అందిస్తున్నదని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారులు శశికళ, కిశోర్‌కుమార్, ఆర్టీసీ డీఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

# చికెన్ ధమాల్

- అమాంతం పడిపోయిన ధరలు
- ఉమ్మడి జిల్లాలో స్కిన్‌లెస్ రూ.160
- అమ్మకాలకు కార్తీకమాసం ఎఫెక్ట్





గద్వాల, డిసెంబర్ 9 : చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. కార్తీకమాసంతో చికెన్ ప్రియులకు అందుబాటులో ధరలు ఉండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కిందటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.280 నుంచి రూ.300 వరకు ఉండేది. ఎన్నికల సమయంలో చికెన్, మటన్ ధరలకు పోటీ నెలకొంది. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతోపాటు కార్తీకమాసం ఉండడంతో అమాంతంగా ధరలు తగ్గిపోయాయి. గతంలో స్కిన్‌తో ఉన్న చికెన్ రూ.220 ఉండగా, ప్రస్తుతం రూ.145కి ధర చేరింది. స్కిన్‌లెస్ చికెన్ ధరలు గతంలో రూ.300వరకు ఉండగా, ప్రస్తుతం రూ.160 వరకు ధరలు ఉన్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో కార్తీకమాసం ముగియనుండడంతో మరోసారి చికెన్ ధరలు పెరిగే అవకాశమున్నది. కార్తీకమాసంలో చాలా మంది శివుడిని పూజించడం వల్ల కొంత మంది మాత్రమే మాంసహారాన్ని భుజిస్తారు. ఈ మాసంలో చికెన్ అమ్మకాలు నెమ్మదిస్తాయి. దీంతో కోళ్ల ఫారం యజమానులు తమ కోళ్లను దుకాణాలకు తక్కువ ధరకే విక్రయిస్తున్నా కొనేవారు లేరు. దీంతో కోళ్ల పెంపకందారులు, వ్యాపారస్తులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కోళ్ల ఫారాలు నిర్వహించే యజమానులు కోళ్లను పెంచిన తర్వాత నిర్ణీత సమయంలో విక్రయించకపోతే నష్టపోయే ప్రమాదం ఉండడంతో ధర వచ్చినకాడికి విక్రయిస్తున్నారు. కార్తీకమాసం పూర్తయ్యే వరకు ఇటు వ్యాపారస్తులకు, అటు కోళ్ల పెంపకందారులకు గడ్డు కాలం ఉండనుండగా, చికెన్ ప్రియులకు మాత్రం చికెన్ చౌకగా లభిస్తున్నది.

## సద్వినియోగం చేసుకోవాలి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష, జెడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్

నారాయణపేట టౌన్, డిసెంబర్ 9 : మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని కలెక్టర్ శ్రీహర్ష, జెడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా దవాఖానలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, చేయూత పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల్లో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకంలో భాగంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేట డిపోలో 87 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉన్నాయని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచిత సేవలు అందుకోనున్నట్లు చెప్పారు. చేయూత పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి రూ.10లక్షలతో సూపర్ స్పెషాలిటీ దవాఖానలో కూడా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందుతాయన్నారు. అనంతరం ఆరోగ్య శ్రీ పోస్టర్‌ను విడుదల చేసి, ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించారు. బస్సులలో మహిళలకు టికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, ఆర్‌ఎంవో పావని, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం బాబు, డీఎం లక్ష్మిసుధా, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్‌కు టికెట్ ఇస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

## 2గంటలు దాటినా టికెట్ తీసుకున్నారు..

ఆత్మకూరు, డిసెంబర్ 9 : మహాలక్ష్మి పథకం ద్వారా టీఎస్ ఆర్టీసీ ప్రభుత్వ ఆదేశానుసారం శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మహిళలకు, బాలికలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉమ్మడి జిల్లాలోని కొన్ని డిపోలలో అమలు అంతంతమాత్రంగానే జరిగింది. మధ్యాహ్నం 2గంటలు దాటాక కూడా కండక్టర్లు కొన్ని చోట్ల మహిళల నుంచి డబ్బులు తీసుకొని టికెట్ ఇచ్చారు. మహిళలు, వృద్ధులు ఈ విషయమై కండక్టర్లను ప్రశ్నించగా, తమకింకా ఆదేశాలు రాలేదంటూ దబాయించారని తెలిపారు. గద్వాల డిపో నుంచి బయలుదేరిన టీఎస్ 33టీ 2555 నెంబర్ గల బస్సులో జూరాల డ్యామ్‌లో ( నందిమల్ల) ఎక్కిన మహిళా ప్రయాణికుల వద్ద కండక్టర్ టిక్కెట్టును తీసుకున్నారు. ఇదే బస్సులో అమరచింతలోనూ కొందరు మహిళా ప్రయాణికులు ఆత్మకూరుకు వెళ్లేందుకు రాగా, వారి నుంచి కూడా కండక్టర్ టిక్కెట్ తీసుకున్నారు. అప్పటికి సమయం 2:30గంటలు దాటినా ప్రయాణికులతో వాదన చేసి మరీ టిక్కెట్ ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఆత్మకూరు బస్టాండ్‌లో మహిళలు ఉచిత ప్రయాణం చేయాలంటూ కంట్రోలర్ శ్రీనివాసులు ప్రచారం నిర్వహించి అందరికీ అవగాహన కల్పించారు. వివిధ డిపోలకు చెందిన బస్సుల్లో మహిళలకు మధ్యాహ్నం 2గంటల నుంచే ఉచిత ప్రయాణాన్ని అమలుచేశారు.




మధ్యాహ్నం 2గంటలు దాటాక మహిళకు ఇచ్చిన బస్ చార్జీ టికెట్

## ఆరోగ్యానికి భరోసా

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



వనపర్తిలో బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, డిసెంబర్ 9 : జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని, ప్రభుత్వ జనరల్ దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంపు కార్యక్రమాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచారని, దీంతో ఆట్టడుగు పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించినట్లు అవుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ విక్రమసింహా, వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్, ఆర్డీవో అవినాశ్, అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్‌గౌడ్, ఆర్టీసీ, వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు బ్రహ్మచారి, సుమిత్ర, జయసుధ, సత్యం, వెంకటేశ్ పాల్గొన్నారు.

## మహిళలకు వరం

- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 9 : మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ఉదయ్‌కుమార్ శనివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లోరిబ్బన్‌కట్ చేసి ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ జనరల్ దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10లక్షల వైద్య ఖర్చుల చేయూతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వేగంగా అమలు చేస్తున్నదన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అనంతరం పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, దవాఖాన సూపరిండెంట్ డాక్టర్ రఘు, ఆర్టీసీ ఆర్‌ఎంవో శ్యామల, డిపో మేనేజర్ దేవరాజ్, ఆర్టీవో ఎర్రిస్వామి, జెడ్పీటీసీలు రోహిణి, సుమిత్ర, గౌరమ్మ, కౌన్సిలర్ జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

# చలికాలం.. నారుమడి పైలం

**మొక్కకు పోషకాలు అందేలా చూడాలి**

**రైతులకు శాస్త్రవేత్తల సూచన**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైతులు ప్రధానంగా పండించే పంట వరి. సాగులో రైతులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ మితిమీరిన తెగులు సోకడంతో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తున్నది. నారుమడి వేసిన నాటి నుంచి కోత కోసే వరకు మందులు పిచికారీ చేయాల్సి వస్తున్నది. ముందస్తుగానే రైతులు నారుమడి సాగులో తగు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్ల బారినుంచి తప్పించుకునే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 9**

### అధికారుల సలహాలు పాటించాలి



ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం ఉంటుంది.

- డా.స్వప్న, కేవీకే శాస్త్రవేత్త





### పాటించాల్సిన జాగ్రత్తలు

* ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నారుమడిలో చలి తీవ్రతను అధిగమించడానికి సాయంత్రం వేళల్లో నీరు పెట్టి ఉదయం తీసెయ్యాలి.
* నారుమడికి వెచ్చదనాన్ని అందించేందుకు కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు, వర్మి కంపోస్టును వాడితే మంచిది.
* తీవ్రస్థాయిలో చలితీవ్రత నుంచి నారుమడిని రక్షించడానికి ఒక అడుగు ఎత్తులో వెదురు బొంగులు పాతి వాటిపై ప్లాస్టిక్ షీట్లను రాత్రి పూట వేసి ఉదయం తొలగించాలి.
* చలికాలంలో పోషకాలు సరిగ్గా అందక కొన్నిసార్లు జింకు లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయి. జింక్ లోపాన్ని నివారించేందుకు జింక్ సల్ఫేట్ 2గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
* ఎకరానికి సరిపడే రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని రెండు దఫాలుగా 6.25కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా 2కిలోల డీఏపీ, 1కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను వాడితే చలి తీవ్రత నుంచి నారు మడులను కాపాడుకోవచ్చు.